ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 12 సెప్టెంబరు 2025



సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

- పోలీసులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం
- కె.కోటపాడు పోలీసు స్టేషన్ తనిఖీ

- 8లో

సైబర్ నేరాలు పెరుగుతున్నందున వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంటు నిర్వీర్యానికి కుట్ర

ప్లాంటును పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి

- కేంద్రంపై ఒత్తిడి తెవాలి
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి



గాజువాక (విశాఖపట్నం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి విశాఖ స్టీల్‌ప్లాంటు తలమానికంగా ఉందని, అటువంటి ప్రతిష్ఠాత్మకమైన కర్మాగారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నాయని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి అన్నారు. స్టీల్‌ప్లాంటులో ఈవోఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్)లను నిరసిస్తూ గురువారం పాతగాజువాక జంక్షన్ నుంచి కొత్త గాజువాక వరకూ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన

ర్యాలీలో పాల్గొన్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, తదితరులు

పాల్గొన్నారు. అనంతరం పాతగాజువాక జంక్షన్‌లో జరిగిన సభలో బేబి మాట్లాడుతూ దేశంలో నాణ్యమైన ఉక్కు ఉత్పత్తిలో విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రథమ స్థానంలో ఉందన్నారు. అంతటి ... మిగతా 8వ పేజీలో

పర్యాటక అభివృద్ధికి కృషి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- అనకాపల్లిలో ఎంపీ రమేశ్‌తో కలిసి 'చాయ్ పే చర్చా'



అనకాపల్లి జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మెయిన్‌రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీ సీఎం రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయని, వీటికి శాశ్వత భవనాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో 74 రైల్వేస్టేషన్‌లను

చర్చా వేదికలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్. పక్కన ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

అమృత్‌భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ నాయకత్వంలో సాధించామన్నారు. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలను ... మిగతా 8వ పేజీలో

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం

ముందస్తు ఏర్పాట్లు మొదలుపెట్టిన ఎన్నికల సంఘం

- వచ్చే నెలలో ఓటరు జాబితాలు, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ
- నవంబరులో ఎన్నికల సిబ్బంది, సామగ్రి సిద్ధం
- పంచాయతీలకు వచ్చే జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం
- ఫిబ్రవరిలో మునిసిపాలిటీలు, జూన్‌లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు..?

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు వచ్చే ఏడాది జనవరిలోనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లా అధికారులు దృష్టి సారించారు.

గ్రామ పంచాయతీలకు 2021 జనవరి/ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు దశల్లో పోలింగ్ జరిగింది. మొదటి దశలో అనకాపల్లి రెవెన్యూ డివిజన్, రెండో దశలో నర్సీపట్నం డివిజన్, మూడో దశలో పాడేరు డివిజన్, నాలుగో దశలో విశాఖపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించారు. వాస్తవంగా 2020లోనే ఎన్నికలు జరగాల్సి వుండగా, కరోనా వైరస్ కారణంగా మరుసటి



సంవత్సరానికి వాయిదాపడ్డాయి. ఆయా పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగుస్తుంది. అయితే గడువుకన్నా ముందే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నీలం సాహ్ని భావిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, పురపాలక శాఖ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటర్ల జాబితాల రూపకల్పన వంటి పనులు ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆయా అధికారులకు స్పష్టమైన సంకేతాలు అందాయి. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదల చేసినప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని స్పష్టం చేశారు. అక్టోబరు 16వ తేదీలోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలి. నెలాఖరులోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. నవంబరు 16వ తేదీ నుంచి 30వ తేదీలోపు ఎన్నికల సిబ్బంది ఎంపిక, పోలింగ్ కేంద్రాలు, బ్యాలట్ బాక్సులు సిద్ధం చేయాలి. వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు రాష్ట్ర ... మిగతా 8వ పేజీలో



వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

మరిడిమాంబ అమ్మవారికి శాకంబరి అలంకరణ

అనకాపల్లి గవరపాలెంలోని మరిడిమాంబ అమ్మవారు గురువారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.

-అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

పట్టు తప్పిందా.. ప్రాణాలు పోయినట్టే!

రాయపురాజుపేట రైతుల జీవన పోరాటం

- ఎర్రిగెడ్డపై 15 ఏళ్ల క్రితం కొట్టుకుపోయిన వంతెన
- ఇంతవరకు నిర్మాణానికి నోచుకోని కొత్త వారధి
- తాటి దుంగలతో తాత్కాలిక వంతెన నిర్మించుకున్న రైతులు
- ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కొట్టుకుపోయిన వంతెన
- తీగ సాయంతో వాగును దాటాల్సిన దుస్థితి



తీగ సాయంతో చెక్ డ్యామ్ మీదుగా వాగును దాటుతున్న రైతులు

చోడవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఒక పక్క ఉధృతంగా పారుతున్న వాగు. మరోవంక వాగుకు అడ్డంగా కట్టిన తీగ సాయంతో ప్రాణాలకు తెగించి పొలాలకు వెళుతున్న అన్నదాతలు. ఇదీ చోడవరం మండలం రాయపురాజుపేట పంచాయతీలోని రైతుల దుస్థితి.

రాయపురాజుపేట గ్రామానికి ఆనుకుని ఎర్రిగెడ్డ వాగు వుంది. దీనికి అవతలవైపున ఈ పంచాయతీ రైతులకు చెందిన సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములు వున్నాయి. గతంలో వాగుపై వంతెన ఉండేది. 2010లో సంభవించిన తుఫాన్‌కు వంతెన కొట్టుకుపోయింది. కొత్త వంతెన నిర్మించాలని అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వర్షా కాలంలో గెడ్డ



ఒక చేతితో తలపై గడ్డిమోపును, మరో చేతితో తీగను పట్టుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న రైతు

ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొన్నిసార్లు రోజుల తరబడి పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటున్నది. కొంతమంది రైతులు సొంత సొమ్ముతో ఇనుప గడ్డర్లు వేసి, వాటిపై తాటి దుంగలు పేర్చి తాత్కాలిక ... మిగతా 8వ పేజీలో

వాగు దాటితేనే పశువులకు మేత



వాగుపై వున్న తాత్కాలిక వంతెన మూడు వారాల క్రితం వరద ఉధృతికి కొట్టుకు పోయింది. మా పొలాలు వాగుకు అవతల వైపున వున్నాయి. పశువులకు రోజూ పచ్చిమేత అవసరం. గెడ్డను దాటడానికి చెక్ డ్యామ్ వద్ద తీగను కట్టుకున్నాం. తలపై గడ్డిమోపు పెట్టుకుని, ఒక చేత్తో తీగను పట్టుకుని గెడ్డను దాడుతున్నాను. ఈ క్రమంలో పట్టుతప్పితే నీటిపడి కొట్టుకుపోవడం ఖాయం.

ఎల్లపు నూకరాజు, రాయపురాజుపేట

మాస్టర్ ప్లాన్ ప్రకారమే నర్సీపట్నం అభివృద్ధి

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపకల్పన

- చుట్టుపక్కల ఉన్న ఆరు పంచాయతీలను కూడా కలిపి..
- ప్రధాన రహదారులు వంద అడుగులకు విస్తరణ
- 150 అడుగుల వెడల్పుతో ఔటర్ రింగ్ రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ ప్లానింగ్ ఆఫీసర్ అరుణవల్లి

- వీఎంఆర్డీఏ ప్లానింగ్ ఆఫీసర్ అరుణవల్లి వెల్లడి
- మాస్టర్ ప్లాన్‌పై వివిధ వర్గాలతో సమావేశం

నర్సీపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ ఆధారంగానే అభివృద్ధి పనులు జరుగుతాయని వీఎంఆర్డీఏ ప్రణాళిక అధికారి వీఎంఆర్డీఏ ప్రణాళిక అధికారి అరుణవల్లి తెలిపారు. మాస్టర్ ప్లాన్‌పై సూచనలు తీసుకోవడానికి గురువారం పట్టణానికి చెందిన వ్యాపారులు, ప్రముఖులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ, మునిసిపాలిటీ బృహత్తర ప్రణాళిక ముసాయిదా నోటిఫికేషన్‌ను ఈ ఏడాది జూలైలో విడుదల చేసినట్టు గుర్తు చేశారు. దీనిపై అభ్యంతరాలు, సూచనలు వెల్లడించాలని కోరారు. అభ్యంతరాలను నివృత్తి చేసిన తర్వాతే తుది ప్రకటన విడుదల అవుతుందని తెలిపారు. రానున్న 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మునిసిపాలిటీతోపాటు చుట్టుపక్కల వున్న చెట్టుపల్లి, ధర్మసాగరం, ఓఎల్‌పురం, గురందొరపాలెం, దుగ్గాడ, నీలంపేట పంచాయతీలను కలిపి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్టు చెప్పారు. నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం, కృష్ణాదేవిపేట, చింతపల్లి, చోడవరం వైపు వున్న రహదారులను 100 అడుగులకు, తుని, అడ్డురోడ్డు వైపునకు ఉన్న రహదారులకు 80 అడుగులకు మాస్టర్‌ప్లాన్‌లో చూపించినట్టు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పట్టణంలో ఐదు రోడ్ల విస్తరణ, కొత్తగా ఐదు రోడ్ల నిర్మాణం, 150 అడుగుల వెడల్పుతో ఔటర్ రింగ్ రోడ్డును ప్రతిపాదించామని చెప్పారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ జిల్లా కార్యదర్శి సుతాపల్లి శ్రావణ్ మాట్లాడుతూ, ఇన్నర్ రింగ్ రోడ్డును అభివృద్ధి చేస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తొలగుతుందని సూచించారు. పట్టణంలోని అన్ని రహదారులను 100 అడుగులకు విస్తరించడం వల్ల కొన్ని ఇబ్బందులు ... మిగతా 8వ పేజీలో

పెద్దేరు నుంచి 350 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయంలోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా గురువారం సాయంత్రానికి 393 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.6 మీటర్లకు చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండడంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి తొమ్మిది గంటలకు స్పిల్ వే మూడో గేటు తెరిచి 350 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈ సుధాకరరెడ్డి తెలిపారు. ఆయకట్టుకు 80 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్టు చెప్పారు.

గోవాడ షుగర్స్ పరిరక్షణకు 17న నిరసన దీక్ష

రైతు, కార్మిక సంఘాల నేతల ప్రకటన

- చెరకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్
- అత్యవసరంగా రూ.35 కోట్లు విడుదల చేయాలని వినతి

చోడవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం ఈ నెల 17న నిరసన దీక్ష చేపట్టాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు నిర్ణయించారు. గురువారం ఫ్యాక్టరీ వద్ద సమావేశమైన నేతలు.. రైతులు, కార్మికుల బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ, షుగర్ ఫ్యాక్టరీని నడిపించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చెరకు రైతులు, కార్మికులకు బకాయిల చెల్లింపు కోసం రూ.35 కోట్లు అత్యవసరంగా విడుదల చేయాలని కోరారు. ఫ్యాక్టరీలో క్రషింగ్‌ను కొనసాగించేందుకు రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు మాట్లాడుతూ, వేతనాలు లేక, భవిష్యత్తు ఏమిటో అర్థం



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

కాక కార్మికులు ఆందోళన చెందుతున్నారని, అందువల్ల షుగర్ ఫ్యాక్టరీ భవితవ్యంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతు సంఘం నాయకుడు ... మిగతా 8వ పేజీలో

స్మార్ట్ రేషన్ కార్డులు రెడీ

- జిల్లాలో 5,41,340 కుటుంబాలకు కార్డులు
- నేటి నుంచి పంపిణీ



ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రేషన్ కార్డుల కోసం చాలా కాలం నుంచి ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇప్పటికే వున్న కార్డుదారులతోపాటు కొత్తవారికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రేషన్ కార్డులను తయారు చేయించింది. ఏటీఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో వీటిని రూపొందిచారు. జిల్లాలో ఇప్పటికే 5,32,340 కుటుంబాలకు ... మిగతా 8వ పేజీలో

పీటీడీ బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల జోరు

▸ ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు ▸ చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి


బస్టాండ్‌లోకి బస్సు వస్తుండగా అడ్డంగా ఉన్న ఇతర వాహనాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీడీ బస్టాండ్ ఆవరణలో ఇతర వాహనాలు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో బస్సులతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్‌లోకి పీటీడీ బస్సులు వచ్చే ఇన్‌గేటు వద్ద ఔట్ గేటు వద్ద ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపు చేస్తున్నారు. దీంతో బస్సులు వచ్చే సమయంలోనూ, వెళ్లే సమయంలోను డ్రైవర్లు అసౌకర్యానికి గురవుతున్నారు. వీటికి తోడు కొందరు ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు తమ ఇష్టానుసారంగా బస్టాండ్ ఆవరణలో వామనాలను నిలుపుతున్నారు. సాయంత్రం సమయంలో కళాశాలలు, పాఠశాలలు విడిచిపెడుతున్న సమయంలో బస్టాండ్ విద్యార్థులతోపాటు ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఇదే సమయంలో కొందరు కుర్రకారు ద్విచక్రవాహనాలతో బస్టాండ్‌లోకి వచ్చి హల్‌చల్ చేస్తున్నారు. బస్టాండ్‌లోకి ఇతర వాహనాలు రాకుండా అటు పోలీసు, పీటీడీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

భారీ వర్షంతో ముమ్మరంగా వరి నాట్లు

▸ నీట మునిగిన పూడిమడక ఉప్పు గల్లీలు


వరినారు తీస్తున్న రైతులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో మరో రెండు రోజుల్లో వరినాట్లు పూర్తయిపోతాయని మండల వ్యవసాయాధికారి శంకర గోవింద తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలో 6.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మెరక ప్రాంతాల్లో ఉన్న వరి పొలాల్లో కూడా వరినాట్లు వేయడానికి రైతులు సిద్ధపడ్డారన్నారు. మండలంలో 1,800 ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉంది. కాని ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాల కారణంగా 1,200 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. తర్వాత వర్షాభావం కారణంగా ఎర్రవరం, మల్లవరం, ఉప్పవరం వంటి ప్రాంతాల్లో నాట్లు వేయడానికి వీలుపడలేదు. అయితే బుధవారం భారీ వర్షం కురియడంతో వరినాట్లు వేయడనికి రైతులు సిద్ధపడ్డారన్నారు. రెండు రోజుల్లో మండలంలో వరినాట్లు వేయడం పూర్తవుతాయని ఆయన తెలిపారు. కాగా బుధవారం కురిసిన భారీ వర్షానికి పూడిమడక ఉప్పు గల్లీలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి.

టిడ్కో కాలనీలో మరమ్మతులకు గురైన మోటార్లు

▸ నీటి కోసం కాలనీవాసులకు తప్పని ఇక్కట్లు ▸ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా


కాలనీలోని ఇన్‌ఫిల్టర్ ట్యాంకులో నీటిని తోడిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో ఇన్‌ఫిల్టర్ ట్యాంకులోని మోటార్లు మరమ్మతుకు గురవ్వడంతో కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం కాలనీ ప్రజలకు నీటిని అందించే సంపులోని మోటార్లు మరమ్మతుకు గురవ్వడంతో ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవడానికిఇ కూడా అవస్థలు పడ్డారు. సమస్యను మునిసిపల్ ఏఈ గణపతి సుబ్బారావు దృష్టికి తీసుకువెళ్లడంతో సత్వరం స్పందించి కాలనీ ప్రజల వాడుక అవసరాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినట్టు కాలనీ ప్రతినిధులు తెలిపారు. టిడ్కో కాలనీ ప్రజలకు నీటిని అందించే ఇన్‌ఫిల్టర్ బావిలోని రెండు మోటార్లు దెబ్బతినడంతో ఈ సమస్య తలెత్తినట్టు స్థానికులు తెలిపారు. తరచూ ఈ మోటార్లు మరమ్మతుకు గురవుతున్నాయని, మునిసిపల్ ఉన్నతాధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించి కాలనీలో మునిసిపల్ కొళాయిలు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. దీంతో అత్యవసర సమయంలో ఉపయోగపడే విధంగా 4 చేతి బోర్లను అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి : కార్యదర్శి డి.దేవానంద్‌రెడ్డి


పాటిపల్లి కేజీబీవీ విద్యార్థులతో రాష్ట్ర కార్యదర్శి డి.దేవానంద్‌రెడ్డి

మునగపాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవడం ద్వారా మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని ఏపీ కస్తూర్బా బాలికా విద్యాలయాల కార్యదర్శి డి.దేవానంద్‌రెడ్డి అన్నారు. మండలంలో పాటిపల్లి కేజీబీవీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధన, వసతిగృహంలో భోజనం తదితర వివరాలపై ఆరా తీశారు. విద్యాలయం పరిసరాలను పరిశీలించారు. భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు తదితర వివరాలను స్కూల్ ప్రత్యేకాధికారి రాణిని అడిగారు.

ఎస్.రాయవరంలో..

విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేపట్టాలని కేజీబీవీ రాష్ట్ర సెక్రటరీ దేవానందరెడ్డి అన్నారు. మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురం కేజీబీవీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా విద్యార్థులకు అనుగుణంగా విద్యా బోధన చేపట్టినట్టయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. అంతకుముందు ఆయన విద్యార్థులకు డిక్టేషన్, స్లిప్ టెస్టు వంటి పరీక్షలను స్వయంగా నిర్వహించి, జవాబు పత్రాలను ఆయనే మూల్యాంకనం చేశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వంటగది, ప్రయోగశాలలను దేవానందరెడ్డి తనిఖీ చేసి ప్రిన్సిపాల్ జి. ఉమామహేశ్వరి, అధ్యాపక బృందానికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రాష్ట్ర ఏజీసీడీవో సబియా సుల్తాన, రాష్ట్ర ఒకేషనల్ కో-ఆర్డినేటర్ శ్రీలలిత, జిల్లా జీసీడీవో ఏఎస్‌డీ జమీమ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినియోగదారుల ప్రశ్నల వర్షం


సదస్సులో సమస్యలను వివరిస్తున్న తుమ్మలపల్లి ఆంజనేయులు

కోటవురట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం కైలాసపట్నం సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సదస్సు సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి. సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుడు తుమ్మలపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మండల కేంద్రంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మేఘం వేసినా.. గాలి వేసినా... చినుకు పడితే చాలు కరెంట్ పోతుందన్నారు. దీనివల్ల వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, గృహస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో ఐరన్ స్తంభాలు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించి సిమెంట్ పోల్స్ వేయించాలని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో ఏదైనా చిన్న సమస్య పరిష్కారానికి ఎల్‌సీ తీసుకోవడం జరుగుతుందని, దీనివల్ల తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నదన్నారు. గత సమావేశంలో ఇచ్చిన ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించారో తెలపాలని ఆంజనేయులు కోరగా.. ఈపీడీసీఎల్ అధికారుల నుంచి ఎటువంటి సమాధానం చెప్పలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సదస్సులో 31 సమస్యలపై వినియోగదారులను ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ డీఈఈ ఏవీఎస్ఎం అప్పారావు, ఏడీఈ సునీల్, ఏఈ పూడి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పిచికారీ డ్రోన్


జంపపాలెం రైతులు కొనుగోలు చేసుకున్న పిచికారీ చేసే డ్రోన్‌తో ఏవో మోహనరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల రైతాంగం కూలీల కొరతను అధిగమించేందుకు ఉపయుక్తంగా ఉండే పిచికారీ చేసే డ్రోన్ అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు. గురువారం పిచికారీ డ్రోన్‌ను జంపపాలెం గ్రామానికి చెందిన గ్రూపు సభ్యులు ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల విలువైన డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై జంపపాలెం గ్రామానికి చెందిన గ్రూపు సభ్యులు కొనుగోలు చేశారన్నారు. ఈ డ్రోన్ ద్వారా ఒక ఎకరాన్ని ఆరు నిమిషాల్లో పిచికారీ చేస్తుందన్నారు. ఈ డ్రోన్ పైలట్‌గా మణికంఠ అనే యువరైతు శిక్షణ తీసుకున్నట్టు తెలిపారు. ఈ యంత్రాన్ని ఉపయోగించుకోదలిచిన రైతులు తనను సంప్రదించాలని వ్యవసాయాధికారి మోహనరావు కోరారు.

దుప్పితూరు సొసైటీ చైర్‌పర్సన్‌గా దేశంశెట్టి



అచ్యుతాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పితూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దేశంశెట్టి వెంకట రమణను నియమించారు. డైరెక్టర్లుగా నునపర్తికి చెందిన రెడ్డి రాజు, దుప్పితూరుకి చెందిన దేశంశెట్టి వెంకట సూర్య శివలను నియమించారు.

రాంబిల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా చిట్టిబాబు



రాంబిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాంబిల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా జడ్‌చింతువా పంచాయతీ శివారు లోవపాలెంకి చెందిన ఎరిపిల్లి చిట్టిబాబు నియమితులయ్యారు. డైరెక్టర్లుగా హరిపురానికి చెందిన ధూళి రమణ, భోగాపురానికి చెందిన ఉరిటి నానాజీలను ప్రభుత్వం నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది. వీరిని కూటమి నేతలు, కార్యకర్తలు అభినందించారు.

కొక్కిరాపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా గోపీనాథ్



ఎలమంచిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ప్రభుత్వం త్రిమెన్ కమిటీని నియమించింది. పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన మోటూరు గోపీనాథ్, డైరెక్టర్లుగా గెడాల అప్పలనాయుడు, ఒమ్మి రాములను నియమించింది. తనను చైర్‌పర్సన్‌గా నియమించినందుకు పార్టీ పెద్దలకు గోపీనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా కోసం బారులు

మునగపాక సొసైటీకి 12 టన్నులు రాక


యూరియా కోసం ^ద్ద బారులు తీరిన రైతులు

మునగపాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియాతో పాటు పలు రకాల ఎరువులు దఫదఫాలుగా దిగుమతి అవుతున్నా రైతులు పరుగులు తీస్తూనే ఉన్నారు. మునగపాక సహకార సంఘానికి 12 టన్నుల యూరియా వచ్చింది. గురువారం యూరియా విక్రయిస్తారనే సమాచారాన్ని రైతులకు సొసైటీ అధికా రులు, పాలకులు సమాచారాన్ని అందించారు. దీంతో యూరియా మళ్లీ దొరుకుందో? లేదో అని సందేహంతో రైతులు వచ్చి సొసైటీ వద్ద క్యూ కట్టారు. ఎరువులు వచ్చినప్పుడల్లా సహకార సంఘాల వద్ద, రైతు సేవా కేంద్రా ల వద్ద ఎరువులు విక్రయాలు చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా మునగపాక సొసైటీ సీఈవో పెంటకోట మహేశ్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో 92 టన్నుల యూరియాను విక్ర యించామన్నారు. తాజాగా 12 టన్నులు రావడంతో విక్రయిస్తున్నామని రైతులు సమా చారం ఇచ్చామన్నారు. మరో రెండు రోజుల్లో మరో 12 టన్నుల యూరియా సొసైటీకి వస్తున్నదన్నారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల ఎరువులు అందుబాటు ఉంటాయన్నారు. ఏ ఎరువు లేకుంటే వెంటనే ఇండెంట్ పెడుతున్నా మన్నారు.

జనసైనికులకు అండగా జనసేనాని : గెడ్డం బుజ్జి


గుంటపల్లిలో మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా హామీ పత్రం అందిస్తున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక సభ్యులకు ప్రమాద బీమా సదుపాయం కల్పించి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అండగా నిలుస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. మండలంలోని గుంటపల్లి, అరట్లకోట గ్రామాలలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన జనసైనికులు సుంకర తరుణ్ కుమార్, గంగిరెడ్ల వెంకట అప్పారావు కుటుంబ సభ్యులకు బీమా హామీ పత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడుతూ జనసైనికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రమాద బీమా సదుపాయం కల్పించారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యగదాసు నానాజీ, భూమి కాలువ చైర్మన్ గెడ్డం చైతన్య, జనసేన నాయకులు ఆచంట దొర నారపురెడ్డి పద్మావతి, మహాలక్ష్మి, తుమ్మల గణేశ్, వినోద్‌రాయల్స్, సుంకర భూషణం పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

జనసైనికుల కుటుంబాలకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని జనసేన పార్టీ సీనియర్ నేత సుందరపు సత్యనారాయణ, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించిన మామిడివాడకు చెందిన జనసైనికుడు రెల్లి సత్తిరాజు కుటుంబ సభ్యులకు పార్టీ అందజేసిన రూ.5 లక్షల బీమా చెక్కును గురువారం వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టా అప్పలనర్స, నాయకులు బద్ది మహేష్, కోనా బాబీ, ఆడారి పరమేశ్, పప్పల లక్ష్మణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నిరసన వారం ప్రారంభం


పాయకరావుపేటలో పోస్టర్ విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన వారాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) మండల నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేహెచ్.వాడ జడ్పీ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి నిరసన వారం పోస్టర్‌ని విడుదల చేశారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీపీఎస్ రద్దు, మెమో 57ను తక్షణం అమలు, 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని,బకాయిలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఆర్.నాయుడు, చంద్రశేఖర్, ఎం.శ్రీనివాసరావు, భారతి, సునీతారాణి పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

గత ఏడాదిన్నర కాలం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావల్సిన డీఏ, పీఆర్‌సీ, ఐఆర్ వెంటనే ప్రకటించాలంటూ గురువారం ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం పలు పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, అప్పలరాజు, గౌరవాధ్యక్షుడు ఫాల్గుణరావు, రాష్ట్ర కౌన్సిలర్ డి కొండలరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని గుర్రాజుపేట జడ్పీ హైస్కూల్, కొరుప్రోలు ఎంపీయూపీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

నక్కపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన దొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయనున్న 22 మంది విద్యార్థులకు గురువారం ఈ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు వై.వెంకట రమణ తన సొంత నిధులతో స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల ఆవరణలో హెచ్ఎం బాలాజీ వి. బాలాజీ, ఉపాధ్యాయులు వైవీ రమణ, ఎంపీపీఎస్-2 పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, గణిత ఉపాధ్యాయుడు సాంబ పిల్లలకు వీటిని పంపిణీ చేశారు. డిసెంబరు 7వ తేదీన జరగనున్న ఎన్ఎంఎస్ పరీక్షల్లో విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించి విజయం సాధించాలని హెచ్ఎం బాలాజీ ఆకాంక్షించారు.

రియల్టర్ రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

అచ్యుతాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి నుంచి రియల్టర్ అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్నారని దుప్పితూరు మాజీ సర్పంచ్ ప్రగడ నాగేశ్వరరావు గురువారం డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత సర్పంచ్, రియల్టర్‌తో కుమ్మక్కై పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండుగ


అమ్మవారిని దర్శించుకున్న నేతలు

మునగపాక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో అమ్మవార్ల పండుగలు గురువారం ఘనంగా జరిగాయి. మూలపేటలో గంగాలమ్మ పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. అదేవిధంగా మునగపాకలో దుర్గాలమ్మ పండుగ జరిగింది. అమ్మవార్లను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపీడీవో


వేంపాడులో ఇంటింటా చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు

నక్కపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించగలమని ఎంపీడీవో డీ సీతారామ రాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సూచించారు. గురువారం మండలంలోని వేంపాడులో ఇంటింటా గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తలను ఎలా సేకరిస్తున్నారో పరిశీలించారు. సంపద కేంద్రంలో సేంద్రియ ఎరువుల ఉత్పత్తులు పెంచాలని సెక్రటరీ ఎం.శ్రీనివాసరావుకు సూచించారు. గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలిచ్చారు.

పారిశుధ్య కార్మికురాలికి టీచర్లు ఆర్థిక సాయం


పారిశుధ్య కార్మికురాలు లక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జడ్పీ హైస్కూల్ పారిశుధ్య కార్మికురాలు లక్ష్మికి హైస్కూల్ నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. ఆమె నివసిస్తున్న పూరి గుడిసె వర్షానికి కారిపోతుండడంతో గతంలో ఇక్కడ హెచ్ంగా పనిచేసిన శాంతి ప్రసూన, విశ్రాంత ఎంఈవో జోష్‌తోపాటు పలువురు పూర్వ ఉపాధ్యాయులు స్పందించి పారిశుధ్య కార్మికురాలికి రూ.18,500 అందజేశారు.తనకు ఆర్థిక సాయం చేసిన పూర్వ ఉపాధ్యాయులకు పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీచర్లు సోమేశ్వరరావు, కళ్యాణి, రామేష్, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మానం

అచ్యుతాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల నుంచి ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన కిలాడి బాలస్వామి, గుబ్బల శిరీష, యాదగిరి భాస్కరరావు, గుబ్బల విజయకుమార్, ఐతు హేమలతలను కొండకర్ల ఉన్నత పాఠశాలలో గురువారం సన్మానించారు. వీరంతా ఈ పాఠశాలలోనే పదవ తరగతి వరకు చదువుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, మల్లారెడ్డి శంకర్ ప్రసాద్, మారిశెట్టి వెంకట అప్పారావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి జాతాను జయప్రదం చేయండి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలని కోరుతూ ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు చేపట్టనున్న రణభేరి జాతాను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ మండల శాఖ ర్యాలీ నిర్వహించింది. మండలంలోని పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులను కలిసి జాతాలో పాల్గొనాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రచార జాతా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పాఠశాల వ్యవస్థను సరిదిద్దాలని, పేరుకుపోయిన బకాయిలను తక్షణమే చెల్లించాలని, తదితర డిమాండ్లపై జాతా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జోగ రాజేశ్, మండల అధ్యక్షులు కట్టా శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి బీవీవీ రమణ, నాయకులు కేఎస్ఆర్‌కే రాజు, జీవీ గోపాల్, చవ్వాకుల వరప్రసాదు పాల్గొనారు.


రణభేరి జాతాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరుతున్న యూటీఎఫ్ నాయకులు

ఘనంగా పసరమారమ్మ పండుగ



రాంబిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారాయుడుపాలెంలో గురువారం గ్రామదేవత పసరమారమ్మ పండుగ ఘనంగా జరిగింది. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాల భక్తులు దర్శించి, పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

క్రికెట్ టోర్నీ విజేత నాగు లెవెన్స్

పాయకరావుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత 20 రోజులుగా జరుగుతున్న పాయకరావుపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ విజేతగా నాగు లెవెన్స్ జట్టు నిలిచింది. గురువారం నాగు లెవెన్స్, మణి లెవెన్స్ మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో నాగు లెవెన్స్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిర్వాహకులు యజ్జల చంద్రశేఖర్, రమేష్, నానాజీ చేతుల మీదుగా విజేత జట్టుకి ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్లేయర్స్ గొల్లపల్లి నాగు, గెడ్డం చలపతి, ధనిశెట్టి బాబి, రమేష్, చిన్న, అరుణ్, నాగభూషణం, వెంకటేశ్, విజయ్, వీరబాబు, నూకరాజు, మణికంఠ పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులకు ప్రోత్సాహం అందరి బాధ్యత

- వ్యాపారులకు ఏ సమస్య వచ్చినా నేరుగా కలవండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివిధ వ్యాపారులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యాపారులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని కోరారు. వ్యాపారులను వ్యాపారస్థులుగానే చూస్తామని రాజకీయలతో ముడిపెట్టి ఎలాంటి ఇబ్బందులు కలిగించే పద్ధతులు సమాజంలో ఉండరాదన్నారు. అనకాపల్లి జిల్లాకు అనేక పరిశ్రమలు వస్తున్నాయని, వాటికి అనుబంధంగా వ్యాపారులు, యువత కొత్త ప్రణాళికలు రూపొందించి పరిశ్రమలు స్థాపించే అవసరం ఉందని వివరించారు. అంతా స్వదేశీ వస్తువులు వాడాలని, లోకల్ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రధానంగా మన ప్రాంతంలో తయారయ్యే వస్తు వులను మనమే ప్రమోట్ చేయాలన్నారు. అనకాపల్లి అంటే అందరికీ గుర్తుకు వచ్చేది బెల్లం అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మన బెల్లానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, మరింత బ్రాండ్‌గా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం జీఎస్టీ వల్ల తగ్గిన వాటిని వివరాలను తెలియజేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చొరవతో నేపాల్ నుంచి తెలుగు ప్రజలకు విముక్తి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలు స్వస్థలాలకు చేరుకునేందుకు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎనలేని కృషి చేశారని, ఆయన చొరవతోనే తెలుగు వారికి నేపాల్ నుంచి విముక్తి కలిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతాయ్య బాబు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ నేపాల్‌లో మారణోమం జరుగుతున్నందున తెలుగు ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో మంత్రి లోకేశ్ వెనువెంటనే స్పందించారన్నారు. అనంతపురం పర్యటన రద్దు చేసుకొని రాష్ట్ర సచివాలయానికి మంత్రి చేరుకొని బాధితులతో టెలిఫోన్‌లో మాట్లాడారని వివరించారు. అక్కడి తెలుగు వారిని దేశానికి తీసుకొచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు అభినందనీయమన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిలో 118 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో తెలుగు ప్రజల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారని తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, విదేశాంగ మంత్రులతో మాట్లాడి ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి చెందిన తెలుగువారు వారి స్వస్థలాలకు చేరేలా లోకేశ్ ఏర్పాట్లు చేపట్టడం అభినందనీయమన్నారు. తెలుగు ప్రజలు ఎక్కడ కష్టాల్లో ఉన్నా, ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపడుతుందని తెలిపేందుకు ఇదో ఉదాహరణగా తాతయ్య బాబు పేర్కొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట



ముహూర్తపు రాట సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామ రాజుపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి గురువారం ముహూర్తపు రాట వేశారు. తొలుత అమ్మవారికి అర్చకులు పూజలు నిర్వహించారు. బొండా భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జాజుల రమేష్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. పదిహేను మంది కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకుంటే వారు కుటుంబాలను ఏవిధంగా పోషిస్తారని ప్రశ్నించారు. తక్షణమే ఇవ్వకపోతే 15వ తేదీ నుంచి మూకుమ్మడిగా సెలవులు పెడతారని స్పష్టం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే కార్మికుల పట్ల అధికారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో బంగారు సాయి, మంగళగిరి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామాపురం కాలనీలో ఆకట్టుకుంటున్న గణపతి



వేడుకల్లో పాల్గొన్న యువకులు

కొత్తూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ రామాపురం కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని మండలం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. డొక్కా సీతమ్మ ఆదిదేవుడు గణపతికి భోజనం వడ్డిస్తున్న కాన్సెప్ట్‌తో సెట్ వేసి గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొని ఆసక్తిగా తిలకించారు.

పల్లె ప్రగతికి ప్రభుత్వం కంకణం

- తాళ్లపాలెంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల
- ఇంటింటికీ మంచి నీరు అందించడమే లక్ష్యమని వెల్లడి



తాళ్లపాలెం వారపు సంతలో నిర్మించిన షెడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్, నూకాంబిక ఆల యం, రామాలయం ఆవరణల్లో నిర్మించిన సీసీ రోడ్లు, ప్లాట్‌ఫాంలు, సంతలో గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో నిర్మించిన తాళ్లపాలెం గ్రామీణ మార్కెట్ షెడ్లను, బంగారయ్యపేట శివారు శివాలయం ఆవరణలో సీసీ రోడ్డు, మేకల కబేళా వద్ద సీసీ రోడ్డును నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు అభివృద్ధి పథకాలను ప్రారంభించామని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే ఇంటింటికీ మంచి నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తిరుమలరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్‌తిరుపతిరావు, డాక్టర్ ఎస్.సుమ, ఏవో స్వప్న, కూటమి నాయకులు కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, గల్లా రాజు, ఉల్లింగల రమేష్, కర్రి సత్యనారాయణ, కర్రి గోవింద, కర్రి లోవరాజు, దాడి నాగరాజు, నయనంశెట్టి రమణారావు, బద్ది రాము తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మెడికల్ సర్టిఫికెట్ల కోసం శిబిరం ఏర్పాటు చేయాలి

తుమ్మపాల : నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ కోరారు. గురువారం ఎమ్మెల్యే కొణతాలను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దివ్యాంగులకు మెడికల్ సర్టిఫికెట్ల కోసం అనకాపల్లిలో శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మొల్లి చంద్రశేఖర్, కోనేటి భార్గవ్, చెట్టుపల్లి శ్రీనివాసరావు, కాళ్ల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ నేత 'చొక్కాకుల'



చొక్కాకులకు పార్టీ కండువా కప్పుతున్న మాధవ్, సీఎం రమేశ్

అనకాపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు గురువారం బీజేపీలో చేరారు. అనకాపల్లిలో ఆ పార్టీ చేపట్టిన 'సారథ్యం' కార్యక్రమంలో భాగంగా చొక్కాకుల ఆయన తనయుడు, అనుచరులతో కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు సబ్బవరం మాజీ ఎంపీపీ, ప్రస్తుత అంతకాపల్లి ఎంపీటీసీ సభ్యుడు గోవింద, అనకాపల్లికి చెందిన వైసీపీ యువ నాయకుడు పలకా రవి పార్టీలో చేరడంతో వీరికి మాధవ్, సీఎం రమేశ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చొక్కాకుల మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, జిల్లా స్థాయిలో ఎంపీ సీఎం రమేశ్ చేస్తున్న కృషికి ఆకర్షితుడినై పార్టీలో చేరినట్టు వెల్లడించారు. గతంలో చిన్నచిన్న పొరపాట్లు జరిగాయని, భవిష్యత్తులో ప్రాణమున్నంత వరకు బీజేపీలోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు

- విద్యార్థినులకు కేజీబీవీల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి సూచన



బాలికలతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న దేవానందరెడ్డి

కశింకోట/ సబ్బవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కేజీబీవీల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి సూచించారు. కశింకోట మండలం తేగాడ, సబ్బవరంలలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను గురువారం సందర్శించారు. తొలుత వంట శాలలను పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్బవరంలో నూతనంగా నిర్మించిన ఒకేషనల్ ట్రేడ్ ఆఫ్ బ్యూటీ అండ్ వెల్నెస్ గదిని ప్రారంభించారు. అనంతరం ఆయా విద్యాలయాల్లో బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. మంచి మార్కులు ఏవిధంగా సాధించవచ్చునో మెలకువలను వివరించారు. ఏ సబ్జెక్టులో సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థినులకు భోజనాలను వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కశింకోటలో అసిస్టెంట్ గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సబియా సుల్తానా, స్టేట్ ఒకేషనల్ కో-ఆర్డినేటర్ శ్రీలత, జీసీడీవో ఏఎస్‌డీ జమీమా, కేజీబీవీ ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ, సబ్బవరంలో ప్రిన్సిపాల్ మృదుల, సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్‌లో 6,127 హెక్టార్లలో నాట్లు పూర్తి

- ఇప్పటి వరకు 2,397 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
- రెండో విడతగా 456 మెట్రిక్ టన్నులు త్వరలో రాక
- వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం



గౌరీ పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం

కొత్తూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలో ఉన్న గౌరీ పీఏసీఎస్‌ను వ్యవసాయ సహాయ సంచాలకుడు సిహెచ్.సుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అనకాపల్లి, కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాల్లో వరి సాధారణ విస్తీర్ణం 6,717 హెకార్లు కాగా, ఇప్పటి వరకు 6,127 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో ఐదు రోజుల్లోగా మిగతా చోట్ల కూడా పూర్తయ్యే అవకాశం ఉందని వివరించారు. చెరకు పంట సాధారణ విస్తీర్ణం 2194 హెక్టార్లు కాగా, 1008 హెక్టార్లలో రైతులు నాటారన్నారు. ఇప్పటి వరకు 2,397 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేశామని చెప్పారు. ఇంకా 456 మెట్రిక్ టన్నుల యూరియా రెండో విడతగా రావాల్సిన ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయ అభివృద్ధికి ప్రణాళిక

- ప్రస్తుత భవనం తొలగించి, కొత్తది నిర్మించేందుకు సన్నాహాలు
- జడ్సీ ఆధ్వర్యంలో విస్తీర్ణాన్ని కొలతలు తీసిన అధికారులు



కార్యాలయ భవనం పై భాగాన్ని పరిశీలిస్తున్న జడ్సీ, ఇతర అధికారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం అభివృద్ధికి అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే కార్యాలయ భవనం పాతబడి ఉండడంతో పాటు పలు గదులు వర్షాలకు కారిపోతుండడంతో ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత కార్యాలయ భవనాన్ని తొలగించి, నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు జోనల్ కార్యాలయ భవనం విస్తీర్ణాన్ని కొలిచారు. భవిష్యత్తులో నూతన కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి, టీపీవో వరప్రసాద్, డీఈఈ గోపాలకృష్ణ, శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పక్కాగా నిర్వహించాలి

- సామాజిక తనిఖీల ప్రజా వేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి, చిత్రంలో డీఆర్‌డీఏ పీడీ

సబ్బవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో ఖర్చు చేసిన రూ.14 కోట్ల పనులకు సంబంధించి అధికారులు సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం కింద చేపట్టే పనులు నాణ్యతతో పక్కాగా సాగాలన్నారు. అనంతరం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్ర, క్లస్టర్ ఏపీడీ మణికుమార్, స్టేట్ ఎస్‌టీ గౌరీశంకర్, ఎస్‌ఆర్‌పీ చిరంజీవి అప్పారావులు పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ బృందాలు ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. వివిధ గ్రామాల్లో జరిగిన పనుల్లో రూ.14 వేలు అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. పీడీ పూర్ణిమాదేవి మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. రికార్డుల నిర్వహణ, కొలతలు పక్కాగా ఉండాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అవకతవకలు జరిగిన మొత్తాన్ని రికవరీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఏపీవోలు వసంతకుమార్, శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



ప్రథమ స్థానం సాధించిన మహిళా జట్టుకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

లంకెలపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి పురుషుల విభాగంలో 25 జట్లు, మహిళల విభాగంలో 8 జట్లు తలపడ్డాయి. మహిళల విభాగం ఫైనల్స్‌లో విశాఖపట్నం, విజయనగరం జట్లు తలపడగా, విశాఖపట్నం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పురుషుల విభాగం ఫైనల్స్‌లో అనకాపల్లి జిల్లా ఎల్.కొత్తూరు, మంత్రిపాలెం జట్లు తలపడగా, ఎల్.కొత్తూరు జట్టు ప్రథమ స్థానం సాధించింది. విజేతలకు జనసేన నేత దుల్ల రామునాయుడు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ల మాదంశెట్టి చినతల్లి, బొండా జగన్, నాయకులు మాదంశెట్టి నీలబాబు, నిర్వాహకులు సాలాపు మోహన్‌రావు, వెంకటఅప్పారావు, సుమన్‌అప్పారావు, సాలాపు శివ, గోవింద్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



లారీ వెనుక చక్రం కింద నుజ్జయిన బైక్

జాతీయ రహదారిపై తప్పిన పెను ప్రమాదాలు



ప్రమాదానికి గురైన అరటి పండ్ల గెలల లోడు వ్యాన్

కొత్తూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ జాతీయ రహదారిపై గురువారం రెండు వేర్వేరు సంఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. హనుమాన్ జంక్షన్ నుంచి చేపల ఫీడ్ లోడుతో కోల్‌కతా వెళుతున్న లారీ పిసినికాడ జాతీయ రహదారి వద్ద అదుపు తప్పి కల్వర్టులోకి వెనుక చక్రం కూరుకుపోయింది. దీంతో పక్కనే పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం దెబ్బతింది. తెల్లవారుజామున ఆరు గంటలకు ఈ సంఘటన జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అదే విధంగా కొత్తూరు కూడలి సమీపంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం పూర్ణా మార్కెట్‌కు అరటి పండ్ల గెలల లోడుతో వెళ్తున్న వ్యాను ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టి అదుపుతప్పి కుడి పక్కకు దూసుకుపోయింది. వ్యాను ముందు భాగం నుజ్జయ్యింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అతి వేగమే ఈ ప్రమాదాలకు కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

మహిళా వసతి గృహాల ఏర్పాటుకు వినతి

తుమ్మపాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత పెద్ద సంఖ్యలో విద్యార్థినులు గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యనభ్యసించేందుకు వస్తున్నారన్నారు. అయితే ఇక్కడ ఒకేఒక్క బీసీ మహిళా వసతి గృహం ఉండడంతో పలువురు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. వసతి గృహంలో సీట్లు ఖాళీలు లేక విద్యార్థినులు చదువుకు స్వస్తి చెప్పి ఇంటి ముఖం పడుతున్నారన్నారు. వసతి గృహాల ఏర్పాటు విషయమై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు జి. ఫణేంద్ర, కన్నబాబు, రాజు, సత్తిబాబు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్బవరం మండల సమావేశం

సబ్బవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ, ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో పద్మజ కోరారు.


టీపీవోగా వరప్రసాద్ బాధ్యతలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా వరప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాలానికిపైగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో జీవీఎంసీ కమిషనర్ గాజువాకలో టీపీవోగా పనిచేస్తున్న వరప్రసాద్‌ను బదిలీ చేయడం ద్వారా భర్తీ చేశారు.

'ఆవఖండాన్ని పరిరక్షించకుంటే అనకాపల్లికి ముప్పు'

తుమ్మపాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆవఖండాన్ని పరిరక్షించాలని ఆవఖండం పరిరక్షణ వేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పరిరక్షణ వేదిక కన్వీనర్ వైఎస్ భద్రం మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ప్లాన్‌కు వ్యతిరేకంగా ఆవఖండంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకుంటే అనకాపల్లి పట్టణానికి పెనుప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కనిశెట్టి సురేష్‌బాబు, గాడి బాలు, రాజాన దొరబాబు పాల్గొన్నారు.

అండర్-19 పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రైఫిల్ షూటింగ్, వుషుకు ఎంపికైన క్రీడాకారులు

పరవాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సంస్కృతి గ్లోబల్ పాఠశాల, ఎస్‌వీఎస్ కళాశాలలో అండర్ -19 క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. రైఫిల్ షూటింగ్, వుషూ, ఫెన్సింగ్, ఘట్కా, కరాటే జూడో పోటీల క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ పుష్పలత సారథ్యంలో ఈ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జట్టు తరుపున ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు ఐదుగురి ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన ఈఎంఆర్ విద్యార్థినులు

చింతపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో జరిగే జాతీయ క్రీడలకు స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షిల్ పాఠశాల, కళాశాల విద్యార్థినులు ఐదుగురు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈఎంఆర్ స్కూల్ స్పోర్ట్స్‌మీట్ బాలికల విభాగం క్రీడలు బుధవారం జరిగాయన్నారు. ఈక్రీడల్లో పాఠశాలకు చెందిన ఎస్. యోగ బాల అండర్ 19 హ్యాండ్ బాల్, పి. మేరి, కె. లక్ష్మీప్రసన్న, కబడ్డీలో వి. నవ్య, డిస్కస్ త్రో పి.స్వీటీ ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఈమేరకు నిర్వాహకులు ఐదుగురు బాలికలను జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారన్నారు. విద్యార్థినులు, పీఈటీ తులిసిని అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి పాల్గొన్నారు.

'పోడు వ్యవసాయంతో తీవ్ర నష్టం'



మాట్లాడుతున్న తోకరాయి గ్రామస్థులు

సీలేరు, సెప్టెంబరు 11 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీకి చెందిన చోడిరాయి గ్రామస్థులు తోకరాయి గ్రామ సరిహద్దున అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తుండడంతో ప్రకృతి విపత్తుల సమయంలో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తోకరాయి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తోకరాయి పారెస్టు సెక్షన్ ఆఫీసర్ సతీశ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ రోపించారు. తిరిగి పోడుకు సరిహద్దులు ఉండవంటూ వారిని ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, పోడును అడ్డగించినందుకు చోడిరాయి గ్రామస్థులు తమపై సీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తోకరాయికి చెందిన కొర్రా రాంబాబు, రెడ్డి రామూర్తి, రెడ్డి మోహనరావు, రెడ్డి ఆనందరావు, కిముడు మహదేవ్ తదితరులు డిమాండ్ చేశారు.

జడ్పీటీసీ సభ్యుడికి పరామర్శ



బాలయ్యను పరామర్శిస్తున్న ఎంపీపీ, తదితరులు

చింతపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యను ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత పరామర్శించారు. వారం రోజులుగా అస్వస్థతతో విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన జెడ్పీటీసీ స్వగ్రామం కొయ్యూరు మండలం మంప గ్రామంలో ఉంటున్నారు. గురువారం నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్టు ఎంపీపీ తెలిపారు.ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి పద్మ, సర్పంచ్ సమిడి గోపాల్, కోఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి, వైసీపీ మండలాధ్యక్షుడు గణబాబు, నాయకుడు బెన్నిబాబు పాల్గొన్నారు.

చినకోనెలలో విద్యుత్ వెలుగులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

అనంతగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రొంపల్లి పంచాయతీ చినకోనెల గ్రామంలోని రెండు నెలల క్రితం ట్రాన్స్‌పార్మర్ కాలిపోయింది. అంధకారంలో చినకోనెల శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన కథనానికి విద్యుత్‌శాఖ ఏడీ ఆనంద్‌మురళీ స్పందించారు. ఆ గ్రామానికీ కాశీపట్నం సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌పార్మర్‌ను తరలించి, యుద్ధప్రతిపాదికను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. లైన్‌మేన్‌లు ఎం.తిరుపతిరావు, ఎస్.భగవాన్, పెంటయ్య, సత్యనారాయణ, పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

అనంతగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ పూలుగుడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గెమ్మెల రాజు కుమార్తె గెమ్మెల అనిత (25) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఈ నేపథ్యంలో టీడీపీ మండల నాయకులు, గురువారం పూలుగుడ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొత్తూరు ఉపసర్పంచ్ గాలి నరసింహమూర్తి ఇచ్చిన రూ.5వేలను టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు అనిత కుటుంబ సభ్యుడు గెమ్మెల రాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోస్య, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, దొన్ను, కళరాజు, చందరరావు, గురుమూర్తి, లచ్చన్న, భీమన్న పాల్గొన్నారు.

కాఫీ రైతులకు న్యాయం చేయాలి: ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాఫీతోటల్లో బెర్రిబోరర్ తెగులుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మత్స్య లింగం కోరారు. గురువారం మండలంలోని పెదలబుడు పంచాయతీ గరడగుడ, డుంబ్రిగుడ మండలం గత్తరజిల్లెడ గ్రామ పరిసరాల్లోని బెర్రి బోరర్ తెగులు సోకిన కాఫీతోటలను పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి బాగ్యలక్ష్మి, అరకు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్ని,వైసీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గరడగుడలో పలు వ్యవసాయవిశ్వవిద్యాలయాల నుంచి తెగులు గుర్తించేందుకు పీజీ విద్యార్థులతో విచ్చేసిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా బెర్రిబోరర్ సోకిన కాఫీతోటల్లో తీసుకుంటున్న నివారణ చర్యలను ఐటీడీఏ పీహెచ్ఓ రాజశేఖర్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా బాపట్ల ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు బెర్రి బోరర్ పురుగుఎలా నివారించవచ్చునో తెలిపారు. ఈ తెగులు ఏ మేర విస్తీర్ణం సోకిందో వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాఫీరైతులను అన్ని విధాలా ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ప్రకటించిన కిలో రూ.50 ను రూ. 100కు పెంచాలన్నారు. ఈ ఏడాది కాఫీరైతు ఆదాయం కోల్పోనున్నందున పరిహారం పెంచాలన్నారు. పాడేరు మాజీ ఎమెమ్మెల్యే కొట్టగుళ్లి బాగ్యలక్ష్మీ మాట్లాడుతూ చింతపల్లి హెచ్ఎన్‌టీసీ ఫాంలో బెర్రిబోరర్ పురుగు నివారణకు చర్యలు చేపట్టారన్నారు. అధిక శాతం అరకులోయ మండలంలో పెదలబుడు, చినలబుడు పంచాయతీల పరిధిలో ఈ పురుగు ఆనవాళ్లు ఉండటం దురదృష్టకరమన్నారు. వ్యవసాయ శా స్త్రవేత్తల సూచనలను రైతులు చర్యలు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



కాఫీతోటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేమత్స్యలింగం, తదితరులు



కాఫీ పండ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తెగులుపై ఆందోళన వద్దు: ఏడీఆర్ అప్పలస్వామి

డుంబ్రిగుడ: బెర్రి బోరర్ తె గులుపై గిరిజన రైతులు ఆందోళన చెందకుండా సస్యసంరక్షణ చర్యలు తీసుకోవాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డాక్టర్ ఏడీఆర్ అప్పలస్వామి అన్నారు. పరిశోధన స్థానానికి చెందిన శాస్త్రవేత్తల బృందం గురువారం మండలంలోని కిల్లోగుడ గ్రామంలో పర్యటించారు. అక్కడి కాఫి తోటలను పరిశీలించారు. స్థానిక సంజీవిని సంస్థ వ్యవసాయ క్షేత్రంలో గిరిజన రైతులు సేకరించిన కాఫీ పండ్లను పరిశీలించారు. బెర్రి బోరర్ అని అనుమానం వస్తే కాఫీ పళ్లను సేకరించి నీళ్లలో మరగబెట్టి మట్టిలో పాతి పెట్టాలని సూచించారు. శాస్త్రవేత్తలు ప్రదీప్‌కుమార్, జోగారావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ పరిధి కిలుములు, బల్లపూరాయి గ్రామంలో కాఫీ తోటలను పెదబయలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు ప్రాంతంలో వ్యాపించిన బెర్రి బోరర్ తెగులుపై రైతులు తగు జాగ్రత్తలు

పీఏసీఎస్ చైర్మన్‌గా త్రిమూర్తులు ప్రమాణస్వీకారం



అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ నిరసన తెలుపుతున్న కె గంగవరం వాసులు

జి.మాడుగుల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌గా తల్లె త్రిమూర్తులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. జనసేన మండల అధ్యక్షుడు ఎం.భీమన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, జానపద కళలు, సృజనాత్మక అకాడమి చైర్మన్, జనసేన పాడేరు ఇన్‌చార్జి వంపూరి గంగులయ్యలు హాజరయ్యారు. అలాగే, పీఏసీఎస్ డైరెక్టర్లుగా కె.కళ్యాణం, కె.వెంకటరమణలను ఘనంగా సన్మానించారు రైతుల అభ్యున్నతికి తోడ్పడేల కృషి చేస్తానని ఈ సందర్భంగా చైర్మన్ త్రిమూర్తులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సోమెలి చిట్టిబాబు, వి.కొండలరావు, బి.బాబురావుతో పాటు జి.మాడుగుల, పాడేరు, చింతపల్లి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి పెంచాలి



నిరసన తెలుపుతున్న కె గంగవరం వాసులు

కొయ్యూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొమ్మిక పంచాయతీ కె. గంగవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాల సంవత్సరం క్రితం వరకు 1 నుంచి 5వ తరగతి వరకు విద్యాబోధన జరిగేదని, ఈ ఏడాదినుంచి 1, 2 తరగతులకు మాత్రమే పరిమితం చేశారన్నారు. దీని వలన 3 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు చదువు ప్రశ్నార్థకమైందన్నారు. గంగవరం గ్రామం కొండ శిఖరున ఉంది. దీంతో గ్రామానికి ఐదు కిలో మీటర్లు దూరంలో బాలారంలో జడ్పీ ఉన్నత పాఠశాల, కొమ్మికలో గిరిజన సంక్షేమ పాఠశాలలకు వెళ్లి అవకాశంలేక 3 నుంచి 5వ తరగతి పిల్లలను విద్యకు దూరం చేసే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా గ్రామంలోనే ఐదో తరగతి వరకు బోధించాలని కోరారు.

దుర్గాదేవి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాడేరు మెయిన్ రోడ్డులో ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు గురువారం ముహూర్తపు రాట(పంది రాట)ప్రతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు వెయ్యాకుల సత్యనారాయణ మాట్లాడుతూ దసరా ఉత్సవాలు విజయవంతానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఏరువాక వెంకటరమణ, కమిటీ ప్రతినిధులు వి.సత్యనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, పి.బుజ్జి, బి.రవి, ఉపాధ్యక్షులు, వైస్ఎంపీపీ జి.శివ కుమార్, బి.ఈశ్వరరావు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

పాడేరురూరల్: ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరగనున్న దేవీ నవరాత్రుల ప్రచార పోస్టర్‌ను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కొట్టగుళ్లి రమాదేవి ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు.ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ప్రధాన అర్చకులు రామన్ పంతులు, అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు.

కొయ్యూరు హౌసింగ్ ఏఈగా ఉమామహేశ్వరరావు



కొయ్యూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న మండల హౌసింగ్ ఏఈ పోస్టులో మఠంభీమవరం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పొత్తూరు ఉమా మహేశ్వరావును నియమించారు. ఇప్పటి వరకు మండలంలో హౌసింగ్ వర్కు ఇన్స్‌పెక్టరుగా పని చేస్తున్న గోవిందు ఏఈ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. హౌసింగ్ ఏఈగా ఆ శాఖ పీడీ పి. బాబుఆదేశాలపై ఉమామహేశ్వరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

జీకే వీధి ఇన్‌చార్జి(ఏఈ)గా లక్ష్మీ విమల



గూడెంకొత్తవీధి: హౌసింగ్‌శాఖ మండల ఇన్‌చార్జి (ఏఈ)గా పసుపులేటి లక్ష్మీవిమల నియమితులయ్యారు. కొంత కాలంగా ఏఈ పోస్టు ఖాళీగావున్నది. దీంతో వర్కుఇన్‌స్పెక్టర్ సెగ్గె సూరిబాబు మండల ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. తాజాగా హౌసింగ్ పీడీ దామనాపల్లి గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లక్ష్మీ విమలను మండల ఇన్‌చార్జిగా నియమించారు.

పెసా చట్టం ... గిరిజనులకు వరం

కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సంచాలకుడు రమిత్ మౌర్య

పాడేరురూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పరిరక్షణ కల్పించే పెసా చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సంచాలకులు రమిత్ మౌర్య అన్నారు. పాడేరు మండలం డి.గొందూరు, హుకుంపేట మండలం తడిగిరిలో పర్యటించారు. పెసా కమిటీ సభ్యులు, మహిళలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో పెసా ప్రత్యేక చట్టం అమలులోకి వచ్చిందన్నారు. గిరిజనుల సంస్కృతిక సాంప్రదాయాలకు అనుగుణంగా వారి అభివృద్ధికి దోహదపడేలా కేంద్రం ఈ చట్టాన్ని రూపొందించిందని అన్నారు. గ్రామ సభలను నిర్వహించి ప్రజా పాలన సాగించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు ఆయనను సత్కరించారు. ఈ సమావేశంలో డీపీవో చంద్రశేఖర్, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, పా డేరు, హుకుంపేట ఎంపీడీవోలు జె.తేజరతన్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



డి.గొందూరు సమావేశంలో మాట్లాడుతున్న రమిత్ మౌర్య

రేషన్ కోసం ప్రాణాలకు తెగించి..



గెడ్డను దాటుకుంటూ రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న దోరగూడ గ్రామస్థులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామ గిరిజనులు కష్టాలు వర్ణనాతీతం. 26 కుటుంబాలకు చెందిన 76 మంది గిరిజనులు.. ప్రతినెలా రేషన్ బియ్యంకోసం లక్ష్మీపురం రావాలి.. అయితే, మార్గమధ్యంలో ఉబ్బెంగుల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.. గురువారం బియ్యం తెచ్చుకునేందుకు గిరిజనులు గెడ్డను దాటుకుంటూ సుమారు 6 కిలో మీటర్లు ప్రయాణించి, రేషన్ తెచ్చుకున్నారు.

మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర - ఒడిశా ఉమ్మడి రాష్ట్రల నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోని రెండురోజులుగా విద్యుత్ అంతరాయం నెలకొంది. 11 కేవీ బుష్‌లను కాలిపోయాయి. గురువారం సాయంత్రం 6 గంటలకు 4వ నంబర్ వినియోగంలోని తీసుకువచ్చి, 23 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. 7 గంటలకు 17 మెగావాట్లను పునరుద్ధరించారు. మొత్తం 40 మెగావాట్లతో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. మూడు జనరేటర్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రాజెక్టు ఎస్ఈ. సుబ్రమణ్యేశ్వరరావు ఆధ్వర్యంలోని సిబ్బంది శ్రమిస్తున్నారు.

ఎస్ఐగా నియమితులైన యువకుడికి సన్మానం



సాయిరామ్ పడాల్‌ని సన్మానిస్తున్న ఉద్యోగులు, నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకుని సబ్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులైన లం బసింగి గ్రామ గిరిజన యువకుడు బోనంగి సాయి రామ్ పడాల్‌ని స్థానిక ఉద్యోగులు, కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. సాయిరామ్ పడాల్ ఎస్ఐగా శిక్షణ పూర్తి కావడంతో విజయనగరం జిల్లా బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా నియమితులయ్యారు. గురువారం స్వగ్రామానికి వచ్చిన సాయిరామ్ పడాల్‌ని ఐటీడీపీ ఇన్‌చార్జి వి. మహేంద్ర, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, వీఆర్వో వెంగడ సదానందరావు, మాజీ సర్పంచ్ రఘునాథ్, గ్రామ పెద్ద దేపూరి గిరిబాబు సన్మానించారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

పాడేరురూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంట్లమామిడి సచివాలయ పరిధి మారుమూల పీవీటీజీ గిరిజన గ్రామాల్లో లబ్ధిదారులకు గురువారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్టు పెసా కమిటీ మండల సహాయ కార్యదర్శి పాలికి లక్కు తెలిపారు. సెల్ సిగ్నల్స్ సైతం లేని మోదాపల్లి పంచాయతీలోని కాంగెడ్డ, కారిబంద గ్రామాల లబ్ధిదారులను 1,965వ నంబర్ గేటు వద్ద ఈ స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టామన్నారు. ఓనూరు, గుర్రగరువు గ్రామాలకు వెళ్లి కార్డుల పంపిణీ పూర్తి చేశామని ఆయన తెలిపారు.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల నిలిపివేత

5 నుంచి 11 వరకు 759 ఎంసీఎఫ్‌టీ నీటి దిగువకు విడుదల

మోతుగూడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపి వేసినట్లు కాంప్లెక్సు పరిధిలోని జెన్‌కో అధి కారులు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డొంకరాయి జలాశయం పూర్తి స్థాయికి చేరుకుంది. జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగుల కాగా, ఈ నెల 5 నాటికి 1035.60 అడుగులకు చేరింది. దీంతో ప్రమాదమని భావించిన అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా 5వ తేదీ రాత్రి జలాశయం ఆరవ నెంబర్ గేటు ఎత్తి దిగువకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటి మట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో వర్షం తగ్గుముఖం పట్టింది. దీంతో గురువారం ఉదయం నాటికి డొంకరాయి జలాశయం నీటి మట్టం 1033..90 అడుగులకు తగ్గుముఖం పట్టడంతో నీటిని విడుదల చేసినట్టు జెన్‌కో అధికార్లు తెలిపారు. ఈ నెల 5 నుంచి గురువారం ఉదయం వరకు 759 ఎంసీఎఫ్‌టీ నీటిని దిగువకు విడుదల చేశాయి. డొంకరాయి జలాశయం నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం 3519 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం సీలేరు కాంప్లెక్సులో 3.7038 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని స్థానిక అధికారులు తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడలకు 26 విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రమణ, ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల (ఈఎంఆర్ఎస్) విద్యార్థులు 26 మంది జాతీయ క్రీడలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎంవీ రమణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నాలుగో రాష్ట్ర స్థాయి ఈఎంఆర్ పాఠశాలల క్రీడలు జరిగాయన్నారు. పాఠశాల నుంచి 60మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనగా 26మంది విద్యార్థులు జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. పాఠశాలకు టేబుల్ టెన్నిస్‌లో బంగారు పతకం, బాస్కెట్ బాల్, వాలీబాల్‌లో రజతం, వ్యక్తిగత బ్యాడింటన్‌లో యామిని ప్రియకు బంగారు, టేబుల్ టెన్నిస్‌లో భూమిక, మాధురికి బంగారు పతకాలు వచ్చాయన్నారు. 400 మీటర్లు పరుగుల పందెం, షార్ట్‌పుట్‌లో హర్ష వర్ధన్ బంగారు, స్విమ్మింగ్‌లో జష్వంత్ బంగారు, టాయ్‌కాడోలో ప్రకాశ్ బంగారు, కుస్తీలో సాయికిరణ్ బంగారు పతకాలు సాధించారన్నారు.

అమరులైన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం: డీఎఫ్‌వో



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న డీఎఫ్‌వో నరసింహరావు, ఉద్యోగులు

చింతపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):: విధి నిర్వాహణలో అమరులైన అటవీశాఖ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని చింతపల్లి డీఎఫ్‌వో వైవీ నరసింహరావు అన్నారు. గురువారం జాతీయ అటవీ అమరుల దినోత్సవం పురస్కరించుకుని డివిజన్ కార్యాలయంలో అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం ఉద్యోగులు మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అడవులు, అడవి జంతువులు పరిరక్షణకు అటవీశాఖ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో విధి నిర్వాహణలో ఉండగా స్మగ్లర్లు, అడవి మృగాలు వల్ల, ప్రమాదవశుత్తు ప్రాణాలను కోల్పోవాల్సివస్తుందన్నారు. ఈ స్థితిలో అమరుల కుటుంబాలకు మనోధైర్యం కలగాలని, వారి ఆశయ సాధనకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ రేంజ్ అధికారులు రేంజ్ అధికారి జె.ప్రశాంతి కుమారి, సీలేరు రేంజ్ అధికారి ఎస్. వెంకటరావు, డీఆర్‌వో వెంకటరాజు పాల్గొన్నారు.

అరకులోయ ఆస్పత్రిలో థైరాయిడ్ శస్త్ర చికిత్స



థైరాయిడ్ శస్త్ర చేసిన శ్రావణితో సూపరింటెండెంట్ ఎల్.రాము, వైద్యులు

అరకులోయ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో థైరాయిడ్ బాధితురాలికి శస్త్రచికిత్సను ఆసుపత్రి సూపరిన్‌డెంట్, జనరల్ సర్జన్ డాక్టర్ లగుడు రాము విజయవంతంగా చేపట్టారు. ఎన్నో ఏళ్ల థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న సుండ్రుపుట్ గ్రామానికి గెమ్మెలి శ్రావణి (31) ఈ నెల 8వ తేదీనఆసుపత్రికి వచ్చారు. ఆమెకు సూపరింటెండెంట్ రాము, ఇతర వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ సర్జన్ రాము మాట్లాడుతూ, ఇటువంటి శస్త్ర చికిత్స అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో మొట్టమొదటిసారిగా విజయవంతంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్య, ఆరోగ్య హక్కుల కోసం వినతి

పాడేరురూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల పరిరక్షణకు సీసీఆర్ కృషి చేస్తోందని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) సభ్యులు వి శ్యామూల్, కె.కామరాజు తెలిపారు. జిల్లాలో విద్య, ఆరోగ్య హక్కుల కోసం గురువారం డీఈవో పి.బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడులను వారి వారి కార్యాలయాల్లో కలిసి వినతులు సమర్పించామన్నారు. కార్యక్రమంలో సీసీఆర్ సభ్యులు జి.అర్జున్, ఎం.బుచ్చిబాబు, పి.చిరంజీవి, యు.శివకుమార్, జి.కామేశ్ పాల్గొన్నారు

మాలధారుల నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులకు రూ. లక్ష అందిస్తున్న సింగన్న

పాడేరురూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పూర్ణ పుష్కలాంబ సహిత అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో నిత్యాన్నదానం కోసం పట్టణానికి చెందిన కొండపల్లి సింగన్న గురువారం అయ్యప్ప సేవా సమితి సభ్యులకు రూ. 1.116 విరాళంగా అందించారు. రానున్న అక్టోబరు 8వ తేదీ నుంచి నవంబరు 18వ తేదీ వరకు మధ్యాహ్నం వేళల్లో అయ్యప్ప, భవానీ, శివ మాలధారులకు నిత్య అన్నదానం (భిక్ష) ఏర్పాటుకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు చర్యలు చేపడతారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వి.సీతారామయ్య, పి.అశోక్, ఎస్. విజయకుమార్, బి.నానాజీ, ఆర్.ప్రవీణ్ శర్మ, బి.త్రినాథ్, పి.సూర్యప్రకాష్, పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో లక్ష సీడ్‌బాల్స్ తయారీ



పాఠశాల విద్యార్థులు తయారు చేసిన విత్తన బంతులు

అరకులోయ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అరకులోయ సెయింట్‌జోసెఫ్ పాఠశాల, కళాశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు వినూత్న కార్యక్రమం చేపట్టారు. గురువారం పద్మాపురంలో ఉన్న సెయింట్‌జోసెఫ్ పాఠశాల ప్రాంగణలో సుమారు వెయ్యిమంది బాల,బాలికలు పనస, సీతాఫలం, నేరేడు, చింత, సంపంగి, జీడి, కాఫీ , కాగు తదితర విత్తనాలను సేకరించి దాదాపు లక్ష విత్తన బాల్స్ తయారు చేశారు. వీటిని అటవీశాఖ అధికారుల సూచనలమేరకు అడవిలో చల్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టుపై పోరాటం ఉధృతం



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు అన్నారు. మండలంలోని వేంగడ పంచాయతీ గోమాంగిపాడులోని గురువారం హైడ్రోపవర్ ప్రాజెక్టు పోరాట కమిటీ అధ్యక్షుడు సాలెపు లచ్చన్న ఆధ్వర్యంలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దుచేసి, గిరిజనులను గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేంగడ మాజీ సర్పంచ్ కొండలరావు, శ్రీరాములు, గోవింద్, వెంకటరావు, దేముడు, చిన్నయ్య, రామ్మూర్తి, గిరిజనులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

కొయ్యూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన గురువారం చేపట్టారు.ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 17 వరకు వివిధ రూపాల్లో నిరసన చేపడతామన్నారు. సంఘ నేతలు బి. అచ్చిబాబు, జాన్ సుధాకర్, భరత్‌కుమార్, మురళీ ఉన్నారు.

8 మందికి సీఎం సహాయ నిధి మంజూరు



సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఖర్చులు భరించలేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4.83 లక్షలు మంజూరైంది. ఈ మేరకు గురువారం వారికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంజూరు పత్రాలను అందజేశారు. గొలుగొండ మండలంలో ఇద్దరికి, నాతవరం మండలంలో ముగ్గురుకి, నర్సీపట్నం మునిసిపాలిటీలో ముగ్గురికి ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వైద్య ఖర్చులు భరించలేని 78మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.75,83,602 మంజూరైనట్టు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి వుషూ పోటీలకు నలుగురి ఎంపిక

నర్సీపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన విశాఖ జిల్లాస్థాయి అండర్-19 వుషూ పోటీల్లో ఇక్కడి అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. దీంతో వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో పి.దుర్గాభవానీ 45 కిలోల విభాగంలో, బి.కావ్య 52 కిలోలు, పి.జ్యోష్ణ మేరీ 60 కిలోలు, వి.ప్రవీణ 65 కిలోల విభాగంలో అద్భుత ప్రతిభ చూపారు. అలాగే, జూడోలో ఎం.రేవతి 44 కిలోలు, పి.కృష్ణ చందన 52 కిలోలు, ఎ.వంశీ 65 కిలోల విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయిని సాయి, కోచ్ ప్రియాంక విద్యార్థులను అభినందించారు.

'క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యం కావాలి'



శోభాయాత్రకు భారీ ర్యాలీగా వెళుతున్న బీజేపీ శ్రేణులు

మాకవరపాలెం,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. అనకాపల్లిలో గురువారం నిర్వహించిన శోభాయాత్రకు ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులతో కలిసి వెళ్లారు. తొలుత జెండాను ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో పార్టీ మరింత అభివృద్ధి చెందడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ అడిగర్ల రాంబాబుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ సంపద సంరక్షణే నిజమైన నివాళి

▸▸ అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లా అటవీ అధికారి శామ్యూల్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి శామ్యూల్

నర్సీపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అంకిత భావంతో పనిచేసి అటవీ సంపదను సంరక్షించడమే అమర వీరులకు అందించిన నిజమైన నివాళి అని జిల్లా అటవీ అధికారి శామ్యూల్ అన్నారు. జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం నర్సీపట్నంలో రేంజ్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తొలుత అమర వీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతా సమష్టిగా పనిచేసినప్పుడే అటవీ శాఖకు మంచిపేరు వస్తుందన్నారు. వన్యమృగాలు, అటవీ సంరక్షణకు రాజీపడకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి కేవీ రాజేశ్వరరావు, సోషల్ ఫారెస్ట్ రేంజర్ సుబ్బారావు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, బీట్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట : విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారులు, సిబ్బంది సేవలు చిరస్మరణీయమని కృష్ణాదేవిపేట అటవీరేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ శాఖ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బంది సేవలను గుర్తుంచుకునేలా ఏటా సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వీరి సేవలను అంతా స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంపదను సంరక్షించాలని సూచించారు. అంతకు ముందు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, గొలుగొండ సెక్షన్ అధికారి వెంకటరమణ, గార్డులు సత్యనారాయణ, రాణి, గణపతి, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేటలో నివాళులర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ సాగుకు నిధులు



పాఠశాలలో కిచెన్‌గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో సత్యనారాయణ

గొలుగొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇరవై పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ సాగుకు ఐదు వేల రూపాయల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. గొలుగొండలో గల ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిచెన్ గార్డెన్ సాగుకు ఉపాధ్యాయులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. లేనిపక్షంలో నిధులను ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సి ఉంటుందని వివరించారు. ప్రధానంగా బెండ, అరటి, మునగ, ఆకు కూరలను పండించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ చూపి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలు ప్రైవేటుపరం చేస్తే ఊరుకోం

▸▸ మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు హెచ్చరిక

▸▸ భీమబోయినపాలెంలో కళాశాల నిర్మాణ పనులు పరిశీలన

మాకవరపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హెచ్చరించారు. మండలంలోని భీమబోయినపాలెంలో చేపడుతున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి రాష్ట్ర వ్యాప్తంగా పదిహేడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉండాలనే లక్ష్యంతో నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. చంద్రబాబునాయుడు పద్నాలు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఒక్క మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు చేయలేదని వారు ఎద్దేవా చేశారు. పీపీపీ కింద మెడికల్ కాలేజీలను ప్రవేటు పరం చేస్తే ఊరుకునేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, వైసీపీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య కళాశాల భవనం పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు, వైసీపీ శ్రేణులు

లోకేశ్ చొరవతో నేపాల్‌లో తెలుగు వారికి విముక్తి

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



తాతయ్యబాబు

అనకాపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలు స్వస్థలాలకు చేరుకునేందుకు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎనలేని కృషి చేశారని, ఆయన చొరవ తోనే తెలుగు వారికి నేపాల్ నుంచి విముక్తి కలిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతాయ్యబాబు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ నేపాల్‌లో మారణహోమం జరుగుతున్నందున తెలుగు ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో మంత్రి లోకేశ్ వెనువెంటనే స్పందించారన్నారు. అనంతపురం పర్యటన రద్దు చేసుకొని రాష్ట్ర సచివాలయానికి మంత్రి చేరుకొని బాధితులతో టెలిఫోన్‌లో మాట్లాడారని వివరించారు. అక్కడి తెలుగు వారిని దేశానికి తీసుకొచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు అభినందనీయమన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిలో 118 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో తెలుగు ప్రజల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారని తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, విదేశాంగ మంత్రులతో మాట్లాడి ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి చెందిన తెలుగువారు వారి స్వస్థలాలకు చేరేలా లోకేశ్ ఏర్పాట్లు చేపట్టడం అభినందనీయమన్నారు. తెలుగు ప్రజలు ఎక్కడ కష్టాల్లో ఉన్నా, ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపడుతుందని తెలిపేందుకు ఇదో ఉదాహరణగా పేర్కొన్నారు.

శాశ్వత అన్నదానానికి చేయూత

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్‌కు ఓ భక్తుడు శాశ్వత అన్నదానం నిమిత్తం లక్షా పదహారు వేల రూపాయలను గురువారం విరాళంగా అందజేశారు. పట్నంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాలు మరింతగా ముందుకు నడిపించాలని కోరుతూ డాక్టర్ అప్పలనాయుడు, సుగుణ దంపతులు కలిసి ఆర్గనేజేషన్‌కు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చూడికి రాని పశువులకు గర్భకోశ చికిత్స

విశాఖ పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ ప్రసాదరావు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సభ్యులు నాగరత్నం, అధికారులు

చీడికాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చూడిరాని పశువులకు గర్భకోశ చికిత్సలు ఎంతో అవసరమని విశాఖ పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ ప్రసాదరావు అ న్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో మండలంలో బైలపూడిలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గాడి నాగరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాదరావు, ఏడీ వి చిట్టినాయుడు మాట్లాడారు. డీఎల్‌డీఏ డాక్టర్ సౌజన్య, చీడికాడ, ఖండివరం పశువైద్య అధికారులు ఏవీఎస్ రాగవమ్మ, గణేశ్‌రెడ్డి 46 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సనందించా టీడీపీ నాయకులు జాజిమొగ్గల సత్యనారాయణ, గణేశ్, పాల్గొన్నారు.

దేవరాపల్లి పీహెచ్‌సీకి బీపీహెచ్ యూనిట్

దేవరాపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి పీహెచ్‌సీని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు, డీఈఈ ఎ.నాగేశ్వరరావు, ఏఈఈ నరేంద్రరెడ్డి గురువారం సందర్శించారు.బీపిహెచ్ యూనిట్ ఏర్పాటుకు ఇటీవల మంజూరైన రూ.50 ల క్షల నిధులతో అవసరమైన భవన నిర్మించనున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ దశలో ఉన్న అదనపు భవనాన్ని కూడా పరిశీలించారు. పీహెచ్‌లో మౌలిక వసతుల వివరాలను వైద్యాధికారి పూజిత మేఘనను అధి కారులు అడిగి తెలుసుకున్నారు.

అటవీ అమరవీరులకు నివాళి



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు

చోడవరం,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీ అమర వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం కావాలని స్థానిక అటవీశాఖ రేంజి అధికారి పీవీ రవి వర్మ తెలిపారు. గురువారం స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన అటవీ అమరవీరుల దినోత్సవంలో ఆయ న మాట్లాడారు. అటవీ సంరక్షణలో తమ అశువులు బాసిన అమరవీరుల త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. వారిఆశయాల సాధన కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అటవీ అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ పరిధిలోని ఉద్యోగులు హాజరయ్యారు.

పన్ను చెల్లించని వారి ఇళ్లకు కుళాయి నీరు కట్

రావికమతం,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి):కుళాయి పన్ను చెల్లించని వంద మంది ఇళ్లకు చెందిన కుళాయి కనెక్షన్లను డమ్మి చేయిస్తున్నామని కొత్తకోట పంచాయతీ ఈవో జ్యోతిశ్వరెడ్డి గురువారం తెలిపారు. వీరు ఏడాదికి ఒక్కో కుళాయి కనెక్షన్‌కు రూ.600 చొప్పున పన్ను చెల్లించలేదన్నారు.

ఏపీటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం కేజేపురం జడ్పీ హైస్కూల్‌లో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, పూర్వపు కార్యదర్శి వెంకటపతిరాజు, పాల్గొన్నారు.

వడ్డాది వంతెన వద్ద భయం..భయం

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. రాత్రి వేళల్లో గ్రానైట్‌తో అధిక బరువుతో వాహనాలు ప్రయాణం, వరద ఉధృతికి వంతెన కింద పెద్ద సొరంగంలా తయారైంది. రోడ్డు అంచు కోతకు గురైంది. వాహనచోదకులు అటుగా ప్రయాణించకుండా స్థానికులు కర్రలతో తాత్కాలిక సూచిక ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరిన ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టి తేలికపాటి వాహనాలు వీలుగా కల్పించారు. విజయరామరాజుపేట కాజ్‌వే కొట్టుకుపోవడంతో ఈ వంతెన పై ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ఈ వంతెన తెగిపోతే మెత్తం రాకపోకలు అంతరాయం కలుగుతుందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వడ్డాది వంతెన వద్ద కోతకు గురవుతున్న రోడ్డు

క్విజ్ పోటీల్లో మరుపాక విద్యార్థుల ప్రతిభ

రావికమతం,సెప్టెంబరు11,(ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థిని మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్య సునీల్ మాట్లాడుతూ, ఆగస్టు 14న దేశవ్యాప్తంగా ఆ సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, వీరిలో తొమ్మిదో తరగతి చదువుతున్న జె.నిహారిక మొదటి స్థానంలో నిలిందన్నారు. ఆమెకు ఆ సంస్థ రూ. 10 వేలు బహుమతి ప్రకటించింది. మరో విద్యార్థి టి. సంతోష్‌కుమార్‌కు కన్సోలేషన్ బహుమతి లభించింది.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

కె.కోటపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అయ్యన్న విద్యా సంస్థలు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తుండడం అభినందనీయమని శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిస్ట్ డాక్టర్ ఎం. రమేశ్ అన్నారు. శంకర్ ఫౌండేషన్, ఆర్క్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్న విద్యాసంస్థలలో రెండు రోజులపాటు నేత్ర వైద్య శిబిరం గురువారం ప్రారంభమైంది. క్యాంప్‌ను అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో కో-ఆర్డినేటర్ పి. హరీశ్‌వర్మ, సిబ్బంది జె. కృపారావు, ఎం.రవి, విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

14న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకారం

చోడవరం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి ప్రమాణస్వీకార కార్యక్రమం ఈనెల 14న నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాధవ్ పర్యటనకు తరలి వెళ్లిన బీజేపీ శ్రేణులు

కె.కోటపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల నుంచి బీజేపీ కార్యకర్తలు గురువారం అనకాపల్లిలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పర్యటన కోసం తరలివెళ్లారు. రామయోగ అగ్రహారం, పొడుగుపాలెం, సింగన్నదొరపాలెం, కె.కోటపాడు, చౌడువాడ తదితర గ్రామాల నుంచి 50 బైకులతో పాటు ఆటోల్లో వెళ్లారు. మండల బీజేపీ అధ్యక్షురాలు పైలా అమ్మాజీ, బీజేపీ సీనియర్ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, జిల్లా నాయకులు దొగ్గ ఈశ్వర ప్రసాద్, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



టి.అర్జాపురం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు

రావికమతం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కోసం గురువారం రైతులు బారులు తీరారు. టి. అర్జాపురం-1, 2 రైతు సేవా కేంద్రాల ద్వారా సుమారు 24 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. వచ్చినది తక్కువ కావడంతో అధికారులు రైతుకు ఒక్కో బస్తా చొప్పున యూరియా అందజేశారు. యూరియా కోసం ఉదయం నుంచే బారులు తీరడంతో ఆ గ్రామ సర్పంచ్ మడగల ఫాల్గుణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతోపాటు గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోల పంపిణీలో సహకరించారు. రాత్రి వరకూ ఉన్నా యూరియా లభించక కొంత మంది రైతులు వెనుతిరిగారు.

ఆటో కార్మికుల ధర్నా

రావికమతం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం పెంచాలని స్థానిక ఆటో యూనియన్ అధ్యక్షుడు కె. వరహాలుబాబు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రావికమతం, కింతలి ఆటో స్టాండ్ యూనియన్ల ఆటో డ్రైవర్లు గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, రావికమతం- కింతలి ఆటో యూనియన్ అధ్యక్షుడు తాళపురెడ్డి చినబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పోటిదొరపాలెం పీఏసీఎస్‌కు త్రి సభ్య కమిటీ ఎంపిక



చైర్‌పర్సన్‌గా ఎంపికైన సత్తిబాబు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోట్టిదొరపాలెం పీఏఎస్‌కు త్రి సభ్యకమిటీ నియామకమైంది. విరోతి సత్తిబాబును చైర్‌పర్సన్‌గా, సభ్యులుగా తాడి అప్పారావు, మండపాక బాబురావులను ప్రభుత్వం నియమించింది. తమ నియామకానికి కృషి చేసిన ఎమెల్యే రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ సత్తిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

మాడుగులలో వర్షం

మాడుగుల/ మాడుగుల రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఓ మాదిరిగా ఎండ కాసింది. ఈతర్వాత తేలికపాటి జల్లుల వర్షం పడింది.

దేవరాపల్లిలో భిన్న వాతావరణం

దేవరాపల్లి: మండలంలో గురువారం విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం మంచుతో రోడ్లు పూర్తిగా కనిపించలేదు. తరువాత 9నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎండ కాసింది. సాయంత్రం 4కు కుండపోత వర్షం పడింది.

పిడుగుపాటుకు ఆవు మృతి

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో దొగ్గ.శ్రీనివాసరావుకు చెందిన ఆవు గురువారం సాయంత్రం పిడుగు పడడంతో మృతి చెందింది. రూ.లక్ష నష్టం కలిగినట్టు బాధితుడు తెలిపారు.

జానకిరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మహారాజ్




రోలుగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గుండుబాడు పంచాయతీ బలిజిపాలెంనకు చెందిన బలిజి మహారాజును నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. మహారాజ్ ప్రస్తుతం జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మండలంలో ఆ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కృషితో చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. ఈయనతో పాటు కసర్లపూడికి చెందిన గొర్లె శ్రీరామమూర్తి, గుండుబాడుకు చెందిన పరవాడ రాజారావులను సభ్యులుగా నియమించారు.

మాడుగుల సీహెచ్‌సీకి కొత్తగా ఇద్దరు వైద్యుల నియామకం

మాడుగుల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో కొత్తగా ముగ్గురు వైద్యులను జిల్లా అధికారులు నియమించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్ వైద్యులు విజయ్‌రాజ్ కుమార్, వై నాయుడులను విధుల్లో చేరారని అన్నారు. అయినా, ఇంకా ముగ్గురు వై ద్యులను నియమించాల్సి ఉందన్నారు. ఆపరేషన్ థియేటర్, అక్కడ కావాల్సినసామగ్రి ఉన్నా గైనికాలజీ వైద్యులు లేక గర్భిణులుఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయికి తీసుకు వెళ్లండి'



వైసీపీ అరకు, పాడేరు నియోజకవర్గాల పరిశీలకుడు సత్యారావును సత్కరిస్తున్న మాజీమంత్రి అమర్

చోడవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలముందుకు తీసుకు వెళ్లడంతో పాటు, స్థాని క సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీమంత్రి అమర్ కార్యకర్తలకు పిలుపునిచ్చా రు. పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ పా ర్టీ పరిశీలకునిగా నియమితులైన ఏడువాక సత్యారావును గురువారం మంత్రి అమర్ అభినందించారు. చోడవరం కార్యకర్తల తో సమావేశమైన అమర్, పార్టీలో కష్టపడిపనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ పటిష్టతకు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా సత్యారావును అమర్ సత్కరించారు. స్థానిక ఎంపీపీ గాడి కాసు, వైసీపీ నా యకులు పల్లా నరసింగరావు, దేవరపల్లి సత్య,బైన ఈశ్వరరావు, బేరా సత్యారావు, నెహ్రూ, మొల్లి ప్రసాద్, కోన చంద్రరావు, వేచలపు ప్రకాశ్ పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, వామపక్ష నేతలు మానం ఆంజనేయులు, జేవీ సత్యనారాయణమూర్తి, మాకిరెడ్డి రామునాయుడు, బాలేపల్లి వెంకటరమణ డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, తదితరులు

తుమ్మపాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేసిన దివంగత నేత సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చిర స్మరణీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవి సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం అనకాపల్లిలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మ రణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో విద్యార్థులను భాగస్వాములను చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సుధాకర్‌రెడ్డి లేని లోటు వామపక్ష ఉద్యమానికి తీరని లోట న్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ సురవరం సుధాక ర్‌రెడ్డి తనకెంతో ఇష్టమైన నేత అని పేర్కొన్నారు. తొలుత సంస్మరణ సభకు హా జరైన నాయకులు సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, బాలే పల్లి వెంకటరమణ, ఆర్.శంకరరావు, రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, గురు బాబు, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

అచ్యుతాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పూడిమడకకు చెందిన ఒక యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. పూడి మడకకు చెందిన అపర్ణ అనే యువతి సెజ్‌లోని ఓ దుస్తుల కర్మాగారంలో పనిచే స్తోందని, బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. దీనిపై కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

» పెళ్లయి మూడున్నర నెలలే!



లోవలక్ష్మి పెళ్లి ఫొటో

కోటవురట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లి దండ్రులు చేసిన పెళ్లి ఇష్టంలేక ఓ వివాహిత ఉరివే సుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కాకినాడ జిల్లా రాగంపేట గ్రామానికి చెందిన చల్లపల్లి లోవలక్ష్మి(24)కి, అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం ఆక్సాహెబ్‌పేట గ్రామానికి చెందిన శానపల్లి రాంబాబుతో ఈ ఏడాది మే 28న వివాహమైంది. తల్లిదండ్రులు ఇష్టం లేని పెళ్లి చేయడంతో నాలుగు నెలలుగా దాంపత్య జీవితానికి దూరంగా ఉంటోంది. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై గురు వారం మధ్యాహ్నం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమ నించి వెంటనే ఆమెను చికిత్స కోసం తుని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కోటవురట్ల పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టు నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెరువులో జారి పడి ఒకరి మృతి

నర్సీపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి.. ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడి మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శివపురం ప్రాంతానికి చెందిన అండలూరి సూరిబాబు (37) బుధవారం బహిర్భూమికని సమీపంలోని పీతల చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలుజారీ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతోపాటు సమీపంలో ఎవరూ లేకపోవడంతో నీటమునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

రోలుగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట గ్రామానికి చెందిన మాకిరెడ్డి రామతల్లి(43) అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణారావు అందించిన వి వరాల ప్రకారం.. బుచ్చెంపేటకు చెందిన మాకిరెడ్డి రామతల్లి ఈ నెల 9వ తేదీన ఆస్పత్రి పనిమీద వెళుతున్నట్టు చెప్పింది. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించడంలేదు. దీంతో భర్త రాజునాయుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

» పోలీసులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం

» కె.కోటపాడు పోలీసు స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని వివరాలు అడుగుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

కె.కోటపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పెరుగుతున్నందున వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనచోదకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టం వంటివాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రచారం చేయాలని చెప్పారు. ఎస్పీ వెంట అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, చోడవరం సీఐ పి.అప్పలరాజు, కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్, దేవరాపల్లి ఎస్ఐ సత్యనారాయణ, చీడికాడ ఎస్ఐ సతీశ్ వున్నారు.

బీజేపీ భారీ ర్యాలీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పక్కన ఎంపీ సీఎం రమేశ్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో అనకాపల్లి పట్టణానికి తొలిసా రి వచ్చిన పీవీఎన్ మాధవ్‌కు పార్టీ నా యకులు గురువారం ఘన స్వాగతం పలి కారు. ఆయన రాక సందర్భంగా బీజేపీ యువ నాయకుడు పలకా రవి ఆధ్వర్యం లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని విజయరామరాజుపేట వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించగా, చోడవరం రోడ్డు, నెహ్రూ చౌక్, ఎన్టీఆర్ జంక్షన్ మీదుగా ఎన్టీఆర్ స్టే డియానికి ర్యాలీ చేరుకుంది.

అక్కడి నుంచి ప్రత్యేక వాహనంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ సీఎం రమేశ్, తదితరులు ఆశీనులై మెయిన్‌రోడ్డు మీదుగా రింగురోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అంతకు ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు డీసీఎంఎస్ కార్యా లయం ఎదుట ఉన్న బొడ్డేడ అచ్చియ్యనా యుడు విగ్రహానికి పూలమాలలు వేసి ని వాళులర్పించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ సహకార రంగానికి డీసీఎంఎస్ వ్యవస్థాపకులు బొడ్డేడ అచ్చి య్యనాయుడు చేసిన కృషి మరువ లేదన్నారు. సహకార ఉద్యమాన్ని రాష్ట్ర దేశవ్యాప్తంగా ముందుకు తీసుకువెళ్లి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువ చ్చారన్నారు.

పట్టు తప్పిందా... ప్రాణాలు పోయినట్టే!

... 5వ పేజీ తరువాయి

వంతెనను నిర్మించుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గెడ్డలో వరద ప్రవాహం ధాటికి తాత్కాలిక వంతెన కొట్టు కుపోయింది. దీంతో రైతులు సమీపంలో వున్న చెక్ డ్యామ్‌కు ఇటువైపు నుంచి అటువైపునకు తీగ కట్టారు. దానిని పట్టుకుని వరద నీటిలో నడుచుకుంటూ పొలాలకు వెళ్లి వస్తున్నారు. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఎర్రిగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. తీగను పట్టుకుని వాగుదాటే క్రమం లో ఏ మాత్రం పట్టుతప్పినా నీటిలో పడి కొట్టుకుపోతారు. ప్రమాదమని తెలిసినప్పటికీ పొలాలకు వెళ్లాల్సి రావడంతో ప్రాణాలకు తెగించి సాహసం చేయాల్సి వస్తున్నదని రైతులు చెబుతున్నారు.

గోవాడ షుగర్స్ పరిరక్షణకు 17న నిరసన దీక్ష

... 5వ పేజీ తరువాయి

దండుపాటి తాతారావు మాట్లాడుతూ, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు, రైతులు, కార్మికుల బకాయిల సాధన కోసం 17వ తేదీ నిరసన దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు. షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం చెరకు రైతులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాజన సభను ఏర్పాటు చేసి, ఫ్యాక్టరీ భవితవ్యంపై ప్రభుత్వం,, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు ఏడువాక శ్రీనివాసరావు, తనకల జగన్, కొణతాల పెదప్పడు, గంగేశ్వరరావు, మల్ల కోటేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి

... 5వ పేజీ తరువాయి

ఇథనాల్ ప్లాంట్లుగా మార్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రాబోతున్నాయని స్థానికులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. బీజేపీ జిల్లా అ ధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చర్లపల్లి- అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి- అనకా పల్లి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు నడుపుతున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. 07035 నంబరు గల రైలు ఈ నెల 13వ తేదీ నుంచి అక్టోబరు నాలుగో తేదీ వరకు ప్రతి శనివారం సాయంత్రం చర్లపల్లిలో (హైదరాబాద్ శాటిలైట్ స్టేషన్) బయలుదేరి మరుసటి రోజు ఉదయం అనకాపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07036 నంబరు గల రైలు సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు ప్రతి ఆదివారం సాయంత్రం అనకాపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం చర్లపల్లి చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడద వోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, ఎలమం చిలి స్టేషన్‌ల్లో ఆగుతుంది. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌క్లాస్, జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

స్మార్ట్ రేషన్ కార్డులు రెడీ!

... 5వ పేజీ తరువాయి

రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్తగా తొమ్మిది వేల కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీరందరికీ మొత్తం 5,41,340 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరో వైపు కార్డుదారుల ఫొటో ఉంటుంది. రేషన్ కార్డు నంబర్, రేషన్ షాపు నంబర్, కుటుంబ సభ్యుల వివరాలను ముద్రించారు. రేషన్ డిపోలో వుండే ఈ-పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డు ను స్కాన్ చేసిన తరువాత రేషన్ పంపిణీ చేస్తారు. కాగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని జిల్లాలో శుక్రవారం ప్రారంభిస్తారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులు ఏమైనా వుంటే సరిచేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తామని, అదే విధంగా కొత్త రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తులు అందజేయవచ్చని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం!

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల కమిషన్ సన్నద్ధం అవుతున్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా మునిసిపల్ పాలకవర్గాల పదవీ కాలం వచ్చేఏడాది మార్చితో ముగుస్తుంది. అయితే ఈసారి రెండు, మూడు నెలల ముందుగానే ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఇక జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం వచ్చే ఏడాది సెప్టెంబరు వరకు వుంది. ఈ స్థానాలకు కూడామూడు నెలల ముందుగానే.. అంటే జూన్ లేదా జూలై నెలల్లో నిర్వహించే అవకాశం వుంది. జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు, 24 జడ్పీటీసీ స్థానాలు, 350కిపైగా ఎంపీటీసీ స్థానాలు, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలు ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలో వున్న అనకాపల్లి జోనల్ ప్రాంతాన్ని మినహాయిస్తే జిల్లాలో సుమారు 11 లక్షల మంది ఓటర్లు వున్నారు.

రాజకీయ పార్టీలు వ్యూహాలు

గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పొత్తు పెట్టుకుని పోటీ చేయాలని ఇప్పటికే కూటమి పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తున్నారు. ఇక వైసీపీ విషయానికి వస్తే.. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఆ పార్టీ అధికారంలో ఉంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను కైవసం చేసుకున్నారు. కానీ ఈసారి కూటమి అధికారంలో వుండడంతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయని ఆయా పార్టీల నేతలు అంటున్నారు.

ఓటరు జాబితాలను సిద్ధం చేస్తాం

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లపై జిల్లా పంచాయతీ అధికారి సందీప్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. ఓటరు జాబితాల తయారీ, వార్డుల విభజన, సర్పంచ్/వార్డు పదవుల రిజర్వేషన్‌లపై కసరత్తు జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల ప్రకారం ముందస్తు ఎన్నిక ల ఏర్పాట్లను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంటు నిర్వీర్యానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

ప్రతిష్టాత్మకమైన ప్లాంటును నిర్వీర్యం చేసేం దుకు కుట్ర జరుగుతుందన్నారు. ప్లాంటును కేంద్రం అమ్మాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకో లేదని ఆరోపించారు. గతంలో ప్రైవేటీకరణ అయి న సంస్థల పరిస్థితి నేడు ఎలా ఎందో రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు ముందుకు రావా లని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ప్రభుత్వ రంగంలోనే ఉపాధి అవకాశాలు వస్తాయని, ప్రైవేటు రంగంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంటు పరిరక్షణకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంటు విషయంలో ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కా ర్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, కార్మిక సంఘ నాయకుడు జె.అయో ధ్యరాం, యు.రామస్వామి, శ్రీనివాసరాజు పాల్గొ న్నారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సత్తిబాబు మృతదేహం

అచ్యుతాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చీమలాపల్లికి చెం దిన నగిరెడ్డి సత్తిబాబు(50) మద్యానికి బానిసయ్యాడు. దీనిపై కుటుంబ సభ్యులు మందలిం చడంతో మనస్తాపం చెంది ఈ నెల 6న గడ్డి మందు తాగి అపస్మారక స్థితి లోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతనిని ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



బి.వెంకటరమణ(ఫైల్)

ఎలమంచిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప ట్టణంలోని ఓ ఇంట్లో విద్యుత్ పనులు చేస్తున్న ఎలక్ట్రీషియన్ విద్యుదా ఘాతంతో మృతి చెందాడు. దీనికి సంబం ధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునిసిపాలిటీ కొత్తపాలెం వార్డు కు చెందిన బీశెట్టి వెంకటరమణ(45) ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. గురువారం ఎలమంచిలి పా తవీధి సమీపంలోని ఓ ఇంట్లో పనులు చేసేందుకు వెళ్లాడు. పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతనిని సీహెచ్‌సీ తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు.

రెండు బైకులు ఢీ: ఒకరి మృతి



చీపురుపల్లి సతీశ్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన అయ్యప్పనగర్ వద్ద గురువారం జరి గింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనకా పల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామానికి చెందిన చీపురుపల్లి సతీశ్ (44) పెందు ర్తిలోని కొరియర్ సంస్థలో పనిచేస్తూ మండలంలోని నాయుడుతోటలో నివాసముంటున్నాడు. విధుల్లో భాగంగా గురువారం తన ద్విచక్రవాహనంపై ఆనందపురం వెళ్తుండగా పెందుర్తి అయ్యప్పనగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన సతీశ్ తలకు తీవ్ర గాయమైంది. స్పందించిన స్థానికులు 108 వాహనంలో కేజీ హెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుం బసభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో వైద్యులు కళ్లను సేకరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	132.00
లైవ్ ధర	152.00
విత్ స్కిన్	274.00
స్కిన్ లెస్	284.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559